# ఉపదేశము

రచన: మధుపం

రామూ !

పిడుగులాంటి వార్తనాకు నిన్ననే తెలిసింది. తండ్రి మరణంతో నువ్వు నీ చైతన్యాన్ని కోల్పోయి, నీహృదయ రక్తమాంసాలను పొడుచుకొని తినే కసితీరని రాబందుల వాడి ముక్కుల్లాంటి పాత తలపులతో బాధపడుతున్నావా. ముసలివెజ్జుకన్నా నిర్వీర్యుడైన దేవుడో దెయ్యమో నీనాన్నని బ్రతికించలేకపోయాడని, మీ హృదయాలకు రంపపుకోత పెట్టాడని వగస్తున్నావా?

వెఱ్ఱివాడా! దుష్టదంష్ట్రలతో మీనాన్నని కాటువేసి,నిన్నుకూడా బాధించే సర్పరోముడూ, కర్కోటకకాయుడూ అయిన ఓ విధిని అర్చిస్తే నీకేదో శాంతి లభిస్తుందని ఆశిస్తున్నావా? ఈవేళ మీ నాన్నని, రేపు నిన్నూ నన్నూ బలి కోరే యీ ఆకలిదేవుణ్ణి ఇంకా ఎన్నాళ్ళలా పూజిస్తావు?

విచారించకు! విచారిస్తే తీర్చేదిక్కూ మొక్కూ నీకులేదు. ఆఉత్తరం చదివేటప్పుడే మా యింటిప్రక్క మంగళవాద్యఘోషలు వినిపిస్తున్నాయి. ఆదేవుడికి ఎన్నో నైవేద్యాలు ఇస్తున్నారు. ఇవ్వాళ కాకపోయినా, ఇంకా కొన్నినాళ్ళకైనా యీ కులికే వధూవరులను బలి కోరకుండా ఉంటాడా అక్షుద్ర రక్తపిపాసి? నాకు ఈ దొంగదేవుళ్లుకాదు నచ్చింది; మన యింటివెనుక ఎఱుక, కోయగూడెంలోని గుడ్డి ముసిలీ, అడుగడుక్కీ రక్తతర్పణం చేస్తారే ఆ నూకలమ్మ, అదే అసలయిన దేవుడు. నీలాటి నాలాటివాళ్ళ కండల్ని రక్తాన్ని బహిరంగంగా కోరే ఆ కాళిక నిజం పలికే దేవత! మనపుర్రెల్ని దండలుగాగ్రుచ్చి మన శ్మశానాల్లోనే శివతాండవం చేస్తానని కంకణంకట్టిన గరళపిపాసి, చిచ్చుకంటివేల్పు-అతడే నిజమయినవేల్పు, నిష్ఠురమైనా కష్టమైనా, సత్యాన్నిచెప్పే మన దేవుడతడే!

అందుచేత నువ్వు విచారించి చేసే పనేమీ లేదు. నిన్ను ఏవిధి మోసగించిందో, దానిమీద పగ సాధించడానికి, కసితీర్చుకోవేందుకు మీ నాన్నను మరచిపో. 'ఎలాగ?' అనకు-ఎలాగో మరచిపో-నువ్వు నీ దేవుడికంటెకూడ రాయి వీరప్పవీ అవు-అయితీరాలి. నీకు కాస్త విచారం కలిగే సూచనలు కనిపిస్తే, నిన్ను నువ్వే తిట్టుకో, నీ అశక్తికి, దౌర్బల్యానికి. కాని కృంగిపోయి ప్రయోజనం ఏమీ లేదు. సత్తువలేనివాడి మీదే నలుగురూ నాల్గురాళ్ళు విసురుతారు, వారిలోనే కూడా 'విధి' ఉందని అంటారు, ఆ విధిస్రష్టలు!

రామూ! నువ్వు అందరిలా అల్పుడవని నేనెన్నడూ అనుకోలేదు; అనుకోను. మరణాన్ని అందరూ కోరతారు, ఎప్పుడో అప్పుడు, ఏదో ఓ క్షణంలో, యీ లోకపు నైచ్యానికి లొంగడానికి అసహ్యించుకొనే నిజమయిన పురుషులంతా! యదార్థంగా—ఆలోచించు!—మరణించిన వ్యక్తికోసం కాదు మన విచారం. మన కోసమే, మనస్వార్థమే. మనకు చేతకాని పనులను, ఇంకొంతకాలం అతనిచేత చేయించి, అతన్నే మథనపడనిద్దామని. ఆబాధ్యతతో అతడింకా కృంగిపోవాలని; మనకు కొంత బాధ్యత తగ్గుతుందని. ఒక మహాపురుషుడైనా, పిసికూన అయినా ప్రాణాలను వదలినప్పుడు ఇందుకోసమే విచారిస్తారు క్షుద్రమానవులు. వారికి శక్తి ఉంటే అతని ఎముకలకి సత్తువకల్పించి, కండలు అతికి, వాటిల్లోకి రక్తంపిండి, ప్రాణంపోసి మరీ బ్రతికిస్తారు. ఇదంతా ఎందుకో తెలుసునా లోకం మన నెత్తినపెట్టిన బాధ్యత, అన్యాయం అతను భరించకుండా సుఖంగా ఉన్నాడనే ఈర్ష్యతో. అంతేకాని ఆజీవి సుఖించాలని కోరదు మనసు.

ఈ అల్పత్వానికి చోటియ్యకు ఏమనిషీ పొందలేని శాంతినీ, సుఖాన్నీ పొందిన మీ నాన్న, బ్రతికున్న మనలాటి జీవచ్ఛవాల కన్న అదృష్టవంతుడని ఆనందించు. అంచేత నిన్నుచూసి కన్నీళ్ళుకార్చే దొంగముఠాల సానుభూతులకు మొహంలోకిచూసి, వికటంగా నవ్వి, వాళ్ల అజ్ఞానసాన్ని హడలకొట్టు. అదే నీకు శాంతి; కాంతి! ఇదే నేను నీకు బోధచేసే వేదాంతము!!